


# ముందుమాటలు

నవలో నాటకమో రాయడమొక ఎత్తు, అది పుస్తక రూపాన వెలుపడినప్పుడు దానికి ముందు మాట రాసుకోడం ఒక్కటీ ఒక ఎత్తు. అసలు ముందు మాటెందుకు రాసుకోవాలో అడగొద్దు. అదొక ఆచారం. పాఠకుల్తో రచయిత ముఖాముఖి సంభాషణది. ఆ నాలుగు మాటలూ వుంటే గ్రంథకర్త కదొక తృప్తి. ముందుమాటలు రాసుకోడంలో చాలా మంది రచయితలు ఫెయిలై పోతున్నట్టు గమనిస్తున్నాను. ముందుమాటంటే ఏమిటి? గుమ్మం ముందు ముగ్గులాంటిది, ఇల్లెంత డాబు సరిగా వున్నా ఇంటిముందు సిరులీనే ముగ్గుకనిపించకపోతే కళరాదు. కనుక ముందు మాటని సింపులుగా ముగ్గనుకుందాం.

కొన్ని ముగ్గులు పరమ నీరసంగానూ హృదయ విదారకంగానూ వుంటాయి. పుస్తకాన్ని అచ్చువేసిన పబ్లిషరు మహాశయుడికి శతకోటి దండాలంటారు. ప్రెస్ యజమానికి ఆజన్మాంతం ఋణపడి వుంటానని హామీయిస్తారు. అక్షరాలు కంపోజ్ చేసిన కంపోజిటర్ హస్తనైపుణ్యానికి జోహార్లంటారు. ఆర్థిక సహాయం చేసిన చింతపిక్కల వీరాస్వామిగారి ఔదార్యం మరువలేనిదంటారు. ఇట్లాగ సవాలక్ష మందికి చేతులెత్తి మొక్కుతూ ముందుమాట ముగిస్తారు. అప్పుడు మనకి ఆ రచయిత మీద బోలెడంత సానుభూతి కలుగుతుంది. నిజానికి వాళ్ళందరి సహకారంతోనే పుస్తకం విడుదల కావచ్చు. అంత మాత్రాన దండకం చదివితే రచయిత మాటేమిటోగానీ ఆ పుస్తకమ్మీద చిన్నచూపు కలుగుతుంది. తాజ్‌మహల్ నిర్మాణంలో రాళ్ళెత్తిన కూలీలను మర్చిపోకూడదని శ్రీశ్రీగారు అంటే అని వుండొచ్చు. పుస్తకం అచ్చయినందుకు అక్షరాలు పేర్చిన కంపోజిటర్ని మర్చిపోతే కళ్ళు పోతాయని ఎవరూ అన్నట్టు దాఖలా లేదు. అలాంటప్పుడీ పొగడ్తలెందుకు?

ముందుమాట రాయడం ఒక ఆర్టు. రెండొందల పేజీల్లో ఏం చెప్పారనే పాయింటు కంటే ఆ పేజీలన్నీ చచ్చినట్టు చదివేందుకు అద్భుతమయిన గ్యారంటీ ముందు మాటల్లో దొరకాలి. అమ్మో, ఇందులో నిధి నిక్షేపాలున్నాయనే ఆశ పాఠకుడికి అందించాలి. అప్పుడే ఆ మాటలకు విలువ. అంతేగాని దండాలు పోగుచేసి పుస్తకం వేసేమంటే తర్వాత చదువుదాములే అని మూసేస్తాం.

ఈ మధ్య ఒక రచయిత్రి రాసిన నవలొకటి విడుదలయ్యింది. ముఖచిత్రం అత్యద్భుతంగా వుంది. ఓహో అనుకుంటాం. నాలుగు పేజీలు రచయిత్రి ముందు మాటలున్నాయి. అవిఎంతో హోదాగా, డాబుసరిగావున్నాయి. అక్షర లక్షలివ్వచ్చు. ఫ్రేం కట్టుకుని ఇంట్లో పెట్టుకుంటే ముందు మాటలకది నమూనాగా వుంటుంది. ఆ పేజీల్లో తన స్టేటసేమిటోతెలివిగా చెప్పింది.

అర్ధరాత్రి మేలుకుని రేడియో గ్రాం ముందర కూచుని విదేశీసంగీతం వింటూ కాగితాలను నలుపు చేసి ఈ నవల పూర్తి చేసిందిట. ఫ్రాన్స్‌లో తానుండగా తన కళ్ళతో చూసిన ఒకానొక తియ్యటి అనుభవం తనకి ప్రేరణకలిగించిదిట. రోమ్‌నగరంలో పావురాలు మెదడులో తిరుగుతుంటే ఫలానా ఛాప్టరు రాసేనని మనవి చేసింది. ఆస్ట్రేలియా అడవుల్లో దారితప్పినప్పటి ఆందోళన మరో ఛాప్టరు మలుచుకున్నానని చెప్పుకుంది. నవలకైనా, కథకైనా సామాజికస్పృహ చాలా అవసరమంది. అది తనకి లండన్లో లభించిందని రాసుకుంది. తన నవలలు సినిమాకి దూరంగా వుంటాయని కోప్పడింది. ఈ నవల పత్రికలలో సీరియల్‌గా వస్తున్నప్పుడు ఆ పత్రిక సర్క్యులేషన్ అమాంతంపెరిగి పోయిందని లెక్కలు చెప్పింది. పుస్తక రూపాన తీసుకొచ్చేందుకు పబ్లిషర్లు పోటీలు పడ్డారని విసుక్కుంది. చివరికి తప్పనిసరై ఈ నవలని ఈ పబ్లిషరు కిచ్చానని వప్పుకుంది.

ఇదేదో గొప్ప గ్రంథమనుకున్నాను. చదవడం ప్రారంభించాను. కథేమిటని అడక్కండి. పరమ ట్రాష్. వాక్యాలూ, వ్యాకరణం నేనూ పట్టించుకోను గనక అదిక్కడ చెప్పను. కనీసం ఫుల్‌స్టాప్ ఎక్కడ పెట్టాలో, కామా ఎప్పుడు వాడాలో పేరాగ్రాపులు ఎట్లా విడగొట్టాలో బొత్తిగా తెలీదామెకి. పుస్తకంలో పేజీకి వందో నూటయేభయ్యో ఆశ్చర్యార్థకాలు వాన చుక్కల్లా వున్నాయి. డైలాగులు కూడా రాసిందిగాని, అవి మనుషులు మాట్లాడే విధంగా లేవు. కనీసం ఎవరే డైలాగు రాసేరో తెలుసుకోవాలనుకుంటే- డైలాగు చివర్న పేరు చదవాల్సిందే తప్ప వేరే మార్గం లేదు. అన్నాడు అనిల్ బాబు, అన్నది మృణాళిని అని రాసి ఎవరన్నారో అనే సమస్యని దూరం చేసింది. పిచ్చి మలుపులు, చెత్తట్విస్టులు ఒక్కపాత్రకీ వెన్నెముకలేదు. సినిమాకి ఆమెగారి నవలలు పనికి రావని రాసుకున్న మాటెంతో నిజం, సినిమాగా తీసే నవలల్లో వస్తువుంటుంది. పాత్ర పోష

ఉంటుంది. అంతేగాని రోమ్ నగరం చూసి వచ్చినంత మాత్రాన ఆమెగారి నవల కొనేసి ఆరు లక్షలు ఎవరూ తగలేసుకోరు.

కొందరు తమ పుస్తకాలకు తాము రాసుకోకుండా ప్రసిద్ధ రచయితల చేత ముందుమాటలు రాయించుకుంటారు. ప్రసిద్ధ రచయితలు రాసే ముందు మాటలు 'ముందుమాటలుగా' గొప్ప కిక్కునిస్తాయి. అతనికి ఆ పుస్తకం నచ్చదు. నచ్చదని రాస్తే రచయిత నొచ్చుకుంటాడు. నచ్చిందని రాస్తే పాఠకులు తిడతారు. అందుచేత తెలివిగా నరుక్కొస్తాడు.

మునుముందు ఈ రచయిత పైకొస్తాడని హామీఇస్తాడేగాని, ఈ పుస్తకంలో సరుకేమిటో సెలవివ్వడు. కథకంటే కథ నడిపించిన తీరు పల్లేదంటాడు. పాత్రలు అబ్బురంగా వున్నా వాటి పోషణ అమోఘమంటాడు. శాస్త్రాలేం చెప్పేయో కొటేషన్లతో సహా పొందుపరుస్తాడు. వాటికీ, ఈ రచనకీ సంబంధమేమిటో ఛస్తే చెప్పడు. రచయితను తిడుతున్నాడో, పొగుడుతున్నాడో అర్థంకాదు. ఈ పుస్తకాన్ని చదవమంటున్నాడో తలకిందపెట్టుకుని బజ్జోమంటున్నాడో తెలీదు. అందుచేత ముందుమాట ఆర్టు చేత కాక పోయినా ఎవడి పుస్తకానికి వాడే ముందుమాట రాసుకోడం బెటరేమోనని నా కనిపిస్తుంటుంది.